క్లుప్తంగా

తైక్వాండో పోటీలో కాంస్య పతకం



నల్లబెల్లి : ఓపెన్ తైక్వాండో 5వ చాంపియన్‌షిప్ పోటీల్లో మండలంలోని రుద్రగూడెం గ్రామానికి చెందిన యువకుడు వక్కల అయ్యప్ప కాంస్య పతకం సాధించాడు. ఈ సందర్భంగా ఆయనను తైక్వాండో అకాడమీ చీఫ్ కోచ్ ఎల్లావుల గణేశ్ మంగళవారం అభినందించి మాట్లాడారు. కోల్‌కత్తాలో ఈనెల 27 నుంచి 29 వరకు జరిగిన సీనియర్ అండర్–74 కేజీల విభాగంలో అయ్యప్ప కాంస్య పతకం సాధించడం అభినందనీయమని తెలిపారు. అయ్యప్పను తెలంగాణ తైక్వాండో సంఘం అధ్యక్షుడు సతీశ్ గౌడ్, ప్రధాన కార్యదర్శి ప్రవీణ్‌కుమార్ అభినందించారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ



రాయపర్తి : మండల కేంద్రంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాల విద్యార్థినులు కీర్తన, ప్రసన్న, రిషిత, శృతి, వైష్ణవి, తేజ, సంధ్య, సుమ రాష్ట్రస్థాయి సీఎం కప్ హ్యాండ్ బాల్ పోటీల్లో ప్రతిభ కనబర్చి సిల్వర్ మెడల్ సాధించినట్లు ప్రిన్సిపాల్ సరిత తెలిపారు. విద్యార్థినులను ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు స్కూల్ ఆవరణలో మంగళవారం అభినందించారు. కార్యక్రమంలో కోచ్ సరస్వతి, ఉపాధ్యాయినిలు పాల్గొన్నారు.

కొలతలు సరిచూసుకోండి



సంగెం : గ్రీన్‌ఫీల్డ్ హైవే అలైన్‌మెంట్ సర్వే జరుగుతున్న క్రమంలో రైతులు కొలతలను ప్రత్యక్షంగా ఉండి సరిచూసుకోవాలని తహసీల్దార్ గనిపాక రాజ్‌కుమార్ కోరారు. మండల కేంద్రంలో అలైన్‌మెంట్ సర్వేను మంగళవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. గ్రీన్‌ఫీల్డ్ హైవేలో భూములు కోల్పోతున్న రైతులకు సకాలంలో పరిహారం అందేలా చొరవ తీసుకుంటామని చెప్పారు. అలైన్‌మెంట్ పూర్తి అయిన భూములకు సంబంధించిన రైతులు బ్యాంకు ఖాతాతోపాటు పట్టాదారు పాస్ బుక్కు, ఆధార్ కార్డు, తదితరాలు సమర్పిస్తే త్వరలో డబ్బులు జమ చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ బాలాజీ, హైవే అథారిటీ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్



సంగెం : స్థానిక పోలీస్‌స్టేషన్‌లో రౌడీషీటర్లకు పర్వతగిరి సీఐ రాజగోపాల్ మంగళవారం కౌన్సెలింగ్ చేశారు. సత్ప్రవర్తనతో జీవించాలని సూచించారు. రౌడీషీటర్లపై ప్రత్యేక నిఘా ఉంటుందని చెప్పారు. సివిల్, ఇతర తగాదాల్లో జోక్యం చేసుకోవద్దని స్పష్టం చేశారు. అసాంఘిక కార్యకలాపాలకు, పంచాయతీలకు పాల్పడితే చట్టరీత్యా కఠిన చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో ఎస్సై ఎల్. నరేష్ పాల్గొన్నారు.

ఆటో యూనియన్ కమిటీ ఎన్నిక

నర్సంపేట రూరల్ : నర్సంపేట మండలంలోని గురిజాల గ్రామంలోని కాకతీయ ఆటో యూనియన్ కమిటీని మంగళవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా దక్క సంపత్, ఉపాధ్యక్షుడుగా పంగ నారాయణ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు సంపత్ మాట్లాడారు. ఆటో కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు.

దుగ్గొండిలో..

దుగ్గొండి : మండల కేంద్రంలోని ఆటో యూనియన్ అధ్యక్షుడిగా పొగాకు దేవేందర్ ఎన్నికయ్యారు. స్థానిక అడ్డా వద్ద నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడుగా పగిడి రవి, కోశాధికారిగా సాంబమూర్తి, కార్యదర్శిగా శివ, గౌరవ సభ్యులుగా భాస్కర్, దేవేందర్, చిరంజీవి, బాబురావు ఎన్నికయ్యారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

నర్సంపేట రూరల్ : రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ ఘటన పట్టణంలోని వల్లభ్‌నగర్‌లో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా వచ్చి ఒకదానికి మరొకటి ఢీకొట్టగా దిలీప్, అస్లాం గాయాల పాలయ్యారు. ఇద్దరినీ చికిత్స కోసం 108లో నర్సంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

పింఛన్ కోసం పడిగాపులు

- రోజుకు వంద మందికే అందజేత
- వృద్ధులు, దివ్యాంగుల వెతలు



పంచాయతీ కార్యాలయం వద్ద వృద్ధులు, దివ్యాంగులు

సంగెం : వృద్ధులు, దివ్యాంగులు పింఛన్ కోసం పడిగాపులు కాస్తున్న దుస్థితి నెలకొంది. స్థానిక సబ్ పోస్టాఫీస్ పరిధిలోని శాయంపేట, వంచనగిరి, సంగెం మండలాలకు చెందిన చింతలపల్లి, ఎల్గూర్ రంగంపేట, ఎల్గూర్ స్టేషన్, గాంధీనగర్, కాట్రపల్లి, కొత్తగూడెం, కృష్ణానగర్, కుంటపల్లి, సంగెం, వెంకటాపూర్ బ్రాంచ్ పోస్టాఫీసుల పరిధిలో 3 వేల 692 మంది పెన్షనర్లున్నారు. వీరందరికీ ప్రతినెలా ప్రభుత్వం పింఛన్ అందిస్తోంది. మిగతా గ్రామాల్లో ఇతర పోస్టాఫీసుల ద్వారా పంపిణీ జరుగుతోంది. కాగా 12 పోస్టాఫీసుల్లో కేవలం ఏడు బ్రాంచ్‌ల్లో మాత్రమే పీఓటీడీ మిషన్లున్నాయి. దీంతో ఒక్కో మిషన్‌తో రెండు గ్రామాల్లోని లబ్ధిదారులకు పింఛన్ పంపిణీ చేయాల్సి వస్తోంది. ఆన్‌లైన్ సర్వర్ ద్వారా లబ్ధిదారుల వేలిముద్రలు తీసుకుని నగదు చెల్లిస్తారు. 2013లో పీఓటీడీ మిషన్లు అందించిన క్రమంలో 2జీ సిమ్‌లు ఇచ్చారు. నేటికీ ఇవే కొనసాగుతుండడంతో తరచూ సర్వర్ బిజీ అంటూ మొరాయిస్తున్నాయి. సర్వర్ బిజీ రాకుండా టెక్నాలజీని అప్‌డేట్ చేసి 5జీ సిమ్ ఇవ్వాల్సి ఉంది. అంతేకాకుండా రోజుకు వంద మందికే ఇచ్చేలా పోస్టాఫీసుల నుంచి డబ్బు సర్దుబాటు చేయడం పరిపాటిగా వస్తోంది. ఈ విషయం తెలియక లబ్ధిదారులు గ్రామపంచాయతీల వద్ద పడిగాపులు కాస్తున్నారు. ముందుగా వచ్చిన వారికి ఇచ్చి డబ్బులు అయిపోయాయని బీఓలు వెళ్లిపోతుండడంతో వృద్ధులు, దివ్యాంగులు పలువురు నిరాశతో వెనుదిరుగుతున్నారు. సర్వర్ సమస్య, పోస్టాఫీసుల అంక్షలతో ఇబ్బంది పడుతున్నామని వృద్ధులు, దివ్యాంగులు వాపోయారు. పింఛన్ తమ బ్యాంకు ఖాతాలో జమ చేస్తే ఇబ్బందులు తొలగిపోతాయని అంటున్నారు.

బ్యాంకు ఖాతాలో జమ చేయాలి



పింఛన్ కోసం ప్రతినెలా ఇబ్బంది పడుతున్నాము. ఒక్కోసారి సర్వర్ పని చేయడం లేదు. పలుసార్లు డబ్బులు అయిపోయి మళ్లీ రమ్మంటారు. శనివారం, ఆదివారాల్లోనూ పెన్షన్ ఇవ్వరు. ఇలాంటి కారణాలతో పోస్టాఫీసు చుట్టూ తిరగలేక సతమతమవుతున్నాం. పలువురు వృద్ధులు, దివ్యాంగులు బీపీ, షుగర్‌తో బాధపడుతూ గంటలు, రోజుల తరబడి ఎదురు చూడలేకపోతున్నారు. ప్రభుత్వం పింఛన్‌ను లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలో జమ చేసి సమస్య పరిష్కరించాలి.

\- ఎర్ల సువర్ణ, పెన్షనర్, సంగెం

సర్వర్ సమస్యతో కొంత ఆలస్యం



ప్రతినెలా 24వ తేదీ నుంచి వృద్ధులు, దివ్యాంగులకు పింఛన్ పంపిణీ చేస్తున్నాం. సర్వర్ సమస్యతో కొంత ఆలస్యం అవుతోంది. నిబంధనల మేరకు డబ్బులు బీఓలకు అందజేస్తున్నాం. వృద్ధులు, దివ్యాంగులను దృష్టిలో ఉంచుకుని బీఓలు నాలుగు గంటలు మాత్రమే కాకుండా అదనపు గంటలు ఉంటూ పింఛన్ అందజేస్తున్నారు. పెన్షనర్లకు ఇబ్బంది కలుగకుండా ఎప్పటికప్పుడు అవసరమైన చర్యలు తీసుకుంటున్నాం. సకాలంలో అందించేందుకు కృషి చేస్తున్నాం.

\- వెంకన్న, సబ్‌పోస్ట్‌మాస్టర్, సంగెం

ప్రభుత్వ ఉద్యోగుల సేవలు కీలకం



గీసుకొండ : సాయిచరణ్‌ను సన్మానిస్తున్న డీసీపీ రవీందర్, తదితరులు



ఖానాపురం : ఎంపీడీఓ భారతి దంపతులను సన్మానిస్తున్న అధికారులు

- వరంగల్ ఈస్ట్‌జోన్ డీసీపీ రవీందర్

గీసుకొండ : ప్రజలకు ప్రభుత్వ ఉద్యోగుల సేవలు కీలకమని వరంగల్ ఈస్ట్‌జోన్ డీసీపీ రవీందర్ తెలిపారు. గీసుకొండ ఎంపీడీఓగా పని చేసి హసన్‌పర్తి ఈటీసీ ఫ్యాకల్టీగా పని చేసిన వీరమల్ల సాయిచరణ్‌ను ఉద్యోగ విరమణ సందర్భంగా మంగళవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో డీసీపీ మాట్లాడారు. సుదీర్ఘ కాలం పాటు ప్రజలకు సేవలు అందించే అవకాశం ప్రభుత్వ ఉద్యోగులకు మాత్రమే ఉంటుందని చెప్పారు. అనంతరం సాయిచరణ్ మాట్లాడారు. దశాబ్దాలుగా ప్రభుత్వ ఉద్యోగిగా ప్రజలకు సేవలు అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో జగిత్యాల డీఎస్పీ రవీంద్రకుమార్, డీఆర్‌డీఏ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాస కుమార్, డీఆర్‌డీఓ మేన శ్రీను, టీజీఓల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు జగన్‌మోహన్‌రావు, నాయకుడు రాజేశ్‌గౌడ్, ఈటీసీ ప్రిన్సిపాల్ విజయ్‌నాయక్, డీఆర్‌డీఓలు కౌసల్యాదేవి, సంపత్‌రావు, అదనపు డీఆర్‌డీఓ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

ఖానాపురం : ఎంపీడీఓ ఈగల భారతి ఉద్యోగ విరమణ సందర్భంగా ప్రజాప్రతినిధులు, అధికారులు, సన్మానించారు. ఈ సందర్భంగా వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ శాఖమూరి హరిబాబు, మాజీ ఎంపీపీ వేములపల్లి ప్రకాశ్‌రావు మాట్లాడారు. ప్రభుత్వ ఉద్యోగులు ప్రజలకు అందించే సేవలతోనే గుర్తింపు లభిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ కిరణ్‌కుమార్, ఏఓ శ్రీనివాస్, ఎంపీఓలు అంబటి సునీల్‌కుమార్, పసరగొండ రవి, కార్యాలయ సూపరింటెండెంట్ వెంకటేశ్వర్‌రెడ్డి, ఆర్ఐ సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

డీజీపీకి వినతి

నెక్కొండ : మండలంలోని అమీన్‌పేట, సూరిపల్లి, రామన్నకుంటతండా, టేకులకుంట తండాలను నెక్కొండ పోలీస్‌స్టేషన్ పరిధిలోకి మార్చాలని కోరుతూ హైదరాబాద్‌లోని కార్యాలయంలో రాష్ట్ర డీజీపీ జితేందర్‌కు స్థానిక మాజీ ఎంపీపీ, తెలంగాణ పంచాయతీ రాజ్ ట్రిబ్యునల్ సభ్యుడు గటిక అజయ్‌కుమార్ మంగళవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం అజయ్‌కుమార్ మాట్లాడారు. మండలాల పునర్విభజనలో భాగంగా చెన్నారావుపేట నుంచి నెక్కొండ మండలంలో అమీన్‌పేట, సూరిపల్లి చేరగా అవి చెన్నారావుపేట మండలంలోనే కొనసాగుతున్నాయని చెప్పారు.

వరంగల్ సీపీకి..

వరంగల్ క్రైం : తన కుటుంబాన్ని నెక్కొండ మండలంలోని నాగారం గ్రామస్తులు కులబహిష్కరణకు గురి చేసిన క్రమంలో ఘటనపై విచారణ చేసి న్యాయం చేయాలని కోరుతూ ఆ గ్రామానికి చెందిన దారపు వెంకటేశ్ మంగళవారం వరంగల్ పోలీస్ కమిషనర్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వెంకటేశ్ వివరాలు వెల్లడించారు. సుమారు 8 నెలల క్రితం జరిగిన చోరీ ఘటనలో తన ఇంటి ఎదురుగా ఉన్న వ్యక్తి పంచాయతీ పెట్టించగా బహిష్కరించారని చెప్పారు. పోలీసులు కేసు నమోదు చేశారని చెప్పారు.

హనుమాన్ ఆలయంలో పూజ



ఖానాపురం : మండలంలోని వేపచెట్టుతండాలో ఇటీవల పునఃప్రతిష్ఠాపన చేసిన హనుమాన్ ఆలయం వద్ద కాంగ్రెస్ నాయకులు మంగళవారం పూజ చేశారు. ఈ సందర్భంగా డీసీసీ అధికార ప్రతినిధి తక్కళ్లపల్లి రవీందర్‌రావు మాట్లాడారు. ఆలయ నిర్మాణానికి నిధులు మంజూరు చేయిస్తానని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు బిక్కి మురళి, పూల్‌సింగ్, సోమన్న, రాజు, దేవేందర్, స్వామి, రాములు, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప ఆలయంలో..

వర్ధన్నపేట : మండలంలోని ఇల్లంద శివారులోని అయ్యప్ప స్వామి ఆలయంలో ఇరుముడి పూజ నిర్వహించగా బీఆర్‌ఎస్ నేత, మాజీ మంత్రి దయాకర్‌రావు, మాజీ ఎమ్మెల్యే నన్నపనేని నరేందర్ పాల్గొని పూజలు నిర్వహించారు. అనంతరం దయాకర్‌రావు మాట్లాడారు. దాతల సహకారంతో ఆలయ ఆవరణలో 2 వేల చదరపు అడుగుల నాపరాయి ఇప్పిస్తానని దయాకర్‌రావు హామీ ఇచ్చారు.

విద్యార్థుల్లో చైతన్యమే ధ్యేయం



విద్యార్థులతో చైర్మన్ రమేశ్, తదితరులు

నర్సంపేట : విద్యార్థులకు సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన కల్పించి చైతన్యవంతం చేయడమే ధ్యేయంగా మదర్‌ల్యాండ్ హైస్కూల్‌లో కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చైర్మన్ పాశికంటి రమేశ్ తెలిపారు. పట్టణంలోని ఆ స్కూల్‌లో మంగళవారం సాంప్రదాయ వస్త్ర ప్రదర్శన కార్యక్రమాన్ని మంగళవారం వేడుకగా నిర్వహించారు. విద్యార్థులు రంగురంగుల సంప్రదాయ దుస్తులు ధరించి అలరించారు. రైతు, లాయర్, డాక్టర్, పోలీస్ ఆఫీసర్, తదితర వేషధారణలతో విద్యార్థులు ఆకట్టుకున్నారు. అనంతరం ప్రిన్సిపాల్ సవితతో కలిసి చైర్మన్ రమేశ్ మాట్లాడారు. ప్రజలు పల్లెటూరి వాతావరణాన్ని మర్చిపోతున్నారని ఆందోళన వెలిబుచ్చారు. పల్లెలు పట్టణాలకు పట్టుకొమ్మలుగా అభివర్ణించారు. జీవితంలో సంస్కృతి, సంప్రదాయాలు కీలకమని చెప్పారు. విద్యార్థులు కేవలం చదువులకే పరిమితం కాకుండా ఆటపాటలు, సంస్కృతి సంప్రదాయాల్లోనూ రాణించాలని సూచించారు. అనంతరం ఉత్తమ వేషధారణతో ఆకర్షించిన విద్యార్థులకు బహుమతులు అందజేసి అభినందించారు.

ఎన్నికల హామీల అమలులో నిర్లక్ష్యం

- బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు సత్యనారాయణ

నర్సంపేట రూరల్ : ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు నామాల సత్యనారాయణ విమర్శించారు. మండలంలోని రాజపల్లిలో మంగళవారం నిర్వహించిన పార్టీ ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. పేదలకు ఏటా రూ.12 వేల భృతి చెల్లిస్తామని, ఇతర అనేక హామీలు గుప్పించి ఓట్లు దండుకుని అధికారంలోకి వచ్చారని చెప్పారు. ఉపాధి హామీ పథకంలో ఏడాదిలో వంద రోజులు పని చేసిన వారికే రూ.12 వేల భృతి చెల్లించాలని నిర్ణయించడం సరికాదన్నారు. పేదలకు బేషరతుగా రూ.12 వేల భృతి చెల్లించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పార్టీ మండల ప్రధాన కార్యదర్శి ఈర్ల నర్సింహరాములు, నాయకులు మోతె జయపాల్‌రెడ్డి, కోమాండ్ల గోపాల్‌రెడ్డి, మోతె పద్మనాభరెడ్డి, మోటూరి రవి, కొడారి రవి, భూక్య వీరన్న, కుమారస్వామి, జర్పుల వీరస్వామి, కందుల రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మిర్చితోటలో అధ్యయనం



దుగ్గొండి : మండలంలోని దేశాయిపల్లికి చెందిన రైతు చల్ల మల్లారావుకు చెందిన మిర్చితోటలో మండలంలోని 34 గ్రామాలకు చెందిన అభ్యుదయ రైతులు మంగళవారం అధ్యయనం చేశారు. ఈ సందర్భంగా మల్లారావు రెండెకరాల భూమిలో తేజ రకం మిర్చి సాగు చేఉసగా పంట ఏపుగా పెరిగి విరగకాసింది. ఈ క్రమంలో అభ్యుదయ రైతులు సందర్శించి పరిశీలించారు. రెండెకరాల్లో ఎకరాకు 30–40 క్వింటాళ్ల దిగుబడి సాధిస్తానని మల్లారావు ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అంద్రు రత్నాకర్‌రెడ్డి, అవునుగంటి సతీశ్, మోర్తాల రాజు, శోభన్, రవీందర్, శ్రీశైలం, బొమ్మెన శోభన్, పాశం పోశాలు పాల్గొన్నారు.

పౌరహక్కుల దినోత్సవం

సంగెం : మండలంలోని కొత్తగూడెంలో మంగళవారం పౌరహక్కుల దినోత్సవం నిర్వహించగా తహసీల్దార్ రాజ్‌కుమార్ హాజరై మాట్లాడారు. పౌరహక్కులను సామాజిక బాధ్యతగా తహసీల్దార్ గనిపాక రాజ్‌కుమార్ అభివర్ణించారు. రాజ్యాంగం కల్పించిన హక్కులు సమాజంలోని అన్ని వర్గాలకు సమానంగా అందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సరిత, వాసం సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులో విత్తనాలు

ఖానాపురం : మండల కేంద్రంలోని రైతువేదికలో ఆర్‌ఎన్‌ఆర్ (తెలంగాణ సోనా) విత్తనాలు అందుబాటులో ఉన్నాయని ఏఓ బోగ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్‌ఎఫ్‌ఎస్‌ఎం పథకం కింద 150 విత్తన బస్తాలు వచ్చాయని పేర్కొన్నారు. రైతులకు రూ.400కు బస్తా ఇస్తారని వివరించారు. ఆసక్తి కలిగిన రైతులు కొనుగోలు చేయాలని కోరారు.

రెడ్డి సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

నర్సంపేట : పట్టణంలోని రెడ్డి పరపతి, సంక్షేమ సంఘం కార్యాలయంలో సంఘాల అధ్యక్షులు కంది గోపాల్‌రెడ్డి, ఎర్ర యాకూబ్‌రెడ్డి ఆధ్వర్యంలో నూతన సంవత్సర క్యాలెండర్‌ను మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గోపాల్‌రెడ్డి, యాకూబ్‌రెడ్డి మాట్లాడారు. నూతన సంవత్సరంలో రెడ్డి కులస్తులు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలన్నారు. పేద కులస్తులకు సంఘం అండగా ఉంటుందని చెప్పారు. అనంతరం పుడమిపుత్ర అవార్డు గ్రహీత మల్లాడి రవీందర్‌రెడ్డిని డాక్టర్ అంద్రు రాజేంద్రప్రసాద్‌రెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు గోపు జైపాల్‌రెడ్డి శాలువాతో సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో నాయకులు మనోహర్‌రెడ్డి, బొమ్మనపల్లి కేశవరెడ్డి, పల్లపు శ్రీనివాస్‌రెడ్డి, మొట్ల లావణ్య జోగిరెడ్డి, తోకల శ్రీనివాస్‌రెడ్డి, చల్లా నర్సింహారెడ్డి, జైపాల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మోకుదెబ్బ క్యాలెండర్..

పట్టణంలోని సర్వాయి పాపన్న విగ్రహం వద్ద గౌడ జన మక్కుల పోరాట సమితి మోకుదెబ్బ నూతన సంవత్సర క్యాలెండర్‌ను రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అనంతుల రమేశ్ గౌడ్ ఆవిష్కరించి మాట్లాడారు. గౌడ కులస్తులు రాజకీయాలకు అతీతంగా ఎదిగే దిశగా సంఘం పాటుపడుతుందని చెప్పారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో గౌడ కులస్తులు పోటీ చేసి సత్తా చాటాలని కోరారు. కార్యక్రమంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం నాయకుడు సోల్తి సారయ్య, మోకుదెబ్బ రాష్ట్ర ప్రచార కార్యదర్శి గొడిశాల సదానందం, జిల్లాల అధ్యక్షులు గోపగాని వెంకట్‌గౌడ్, తోటకూరి రాందాస్, ముంజాల రాజేందర్, రాష్ట్ర నాయకులు రామగోని సుధాకర్, శీలం వెంకన్న, మద్దెల సాంబయ్య, మచ్చిక రాజు, రడం శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శులు బొడిగే మల్లేషం, కొండి రాము, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పంజాల వెంకట్, తదితరులు పాల్గొన్నారు.

నూతన సంవత్సర వేడుకలు



నర్సంపేట : కేక్ కట్ చేస్తున్న సీడీపీఓ మధురిమ



నర్సంపేట రూరల్ : బాలాజీ టెక్నో స్కూల్‌లో..



సంగెం : కేక్ కట్ చేస్తున్న తహసీల్దార్

నర్సంపేట/నర్సంపేట రూరల్ : నర్సంపేట సెక్టార్ పరిధిలోని అంగన్‌వాడీ టీచర్లు, ప్రీ స్కూల్ విద్యార్థులతో కలిసి ప్రాజెక్టు సీడీపీఓ మధురిమ, ఏసీడీపీఓ హేమలత మంగళవారం కేక్ కట్ చేసి నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. అలాగే అక్షర ద స్కూల్, బిట్స్ స్కూల్, లక్నెపల్లి శివారు బాలాజీ టెక్నో స్కూల్‌లో బాలాజీ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ రాజేంద్రప్రసాద్‌రెడ్డి, ట్రెజరర్ వనజ కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమాల్లో పోషన్ అభియాన్ జిల్లా కోఆర్డినేటర్ కార్తీక్, నర్సంపేట సెక్టార్ సూపర్‌వైజర్ రమాదేవి, అంగన్‌వాడీ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు నల్ల భారతి, ప్రాజెక్టు అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గొరె రాధ, బత్తిని శిరీష, బాలాజీ విద్యాసంస్థల కార్యదర్శి రాజేశ్వర్‌రెడ్డి, బాలాజీ ఇంటిగ్రేటెడ్ టీచింగ్ స్కూల్ ప్రిన్సిపాల్ జ్యోతి, అక్షర ద స్కూల్ ప్రిన్సిపాల్ భవాని, తదితరులు పాల్గొన్నారు.

సంగెం : మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, స్కూళ్లలో వేడుకలు నిర్వహించారు. కేక్ కట్ చేసి నూతన సంవత్సరానికి స్వాగతం పలికారు. విద్యాభారతి హైస్కూల్‌లో విద్యార్థులు 2025 ఆకారంలో కూర్చుని సందడి చేశారు.

పారదర్శకంగా సర్వే చేయాలి



చెన్నారావుపేట : సర్వేను పరిశీలిస్తున్న సీఈఓ



పర్వతగిరి : మాట్లాడుతున్న శ్రీనివాస్ నాయక్

- జెడ్పీ సీఈఓ రాంరెడ్డి

చెన్నారావుపేట : ఇందిరమ్మ ఇండ్ల సర్వేలో అధికారులు, సిబ్బంది పారదర్శకత పాటించాలని జెడ్పీ సీఈఓ రాంరెడ్డి ఆదేశించారు. మండలంలోని జల్లి గ్రామంలో మంగళవారం జరిగిన ఇంటింటి సర్వేను ఆయన పరిశీలించి మాట్లాడారు. సర్వేను సకాలంలో పూర్తి చేయాలని చెప్పారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి డాక్టర్ బాలకృష్ణ, ఎంపీడీఓ శ్రీవాణి, పంచాయతీ కార్యదర్శి వీరన్న, తదితరులు పాల్గొన్నారు.

చింతనెక్కొండలో..

పర్వతగిరి : మండలంలోని చింతనెక్కొండలో సర్వేను కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జాటోతు శ్రీనివాస్‌నాయక్ పరిశీలించి మాట్లాడారు. ఇందిరమ్మ కమిటీ సభ్యులు, నాయకులు అధికారులతో సమన్వయం చేసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు ఓరుగంటి శ్రీనివాస్, నాయకులు రాంచందర్‌రావు, గురువారావు, దబ్బెట నర్సయ్య, వంగ సాయిలు, రవి, గణేశ్, తదితరులు పాల్గొన్నారు.

డ్రమ్‌సీడర్ విధానంతో అధిక లాభాలు



డ్రమ్‌సీడర్ విధానాన్ని పరిశీలిస్తున్న వీరభద్రం

రాయపర్తి : వ్యవసాయ క్షేత్రంలో దమ్ము చేసిన వెంటనే డ్రమ్‌సీడర్‌తో నేరుగా విత్తడంతో ఖర్చు తక్కువతో ఎక్కువ లాభాలు పొందవచ్చని మండల వ్యవసాయ అధికారి (ఏఓ) గుమ్మడి వీరభద్రం తెలిపారు. మండలంలోని కాట్రపల్లిలో వరి విత్తనాన్ని నేరుగా విత్తే డ్రమ్‌సీడర్ విధానాన్ని మంగళవారం ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన డ్రమ్‌సీడర్ విధానాన్ని ఆయన పరిశీలించి మాట్లాడారు. ఎకరాలో 12 కేజీల విత్తన మోతాదుతో కూలీల కొరతను అధిగమించవచ్చని చెప్పారు. పంట కోత సైతం ముందుగానే వస్తుందని చెప్పారు. రెండో పంట కూడా 7 నుంచి 10 రోజుల ముందే విత్తుకోవచ్చని తెలిపారు. రైతుల సమయం ఆదా కావడంతోపాటు కూలీల కొరత అధిగమించి వివరించారు. వరిలో దిగుబడులను సాధించేలా రైతులు చైతన్యవంతం కావాలని కోరారు. కార్యక్రమంలో ఏఈఓ పసరుగొండ మనస్విని, రైతులు కడుదూరి నరేశ్, బూడిద రవి తదితరులు పాల్గొన్నారు.

దామాషా ప్రకారం రిజర్వేషన్లు కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కుమారస్వామి

నర్సంపేట : రాష్ట్రంలో రిజర్వేషన్ల పరిమితిని ఎత్తివేసి కేంద్ర ప్రభుత్వం ద్వారా కులగణన నిర్వహించి బీసీలకు దామాషా ప్రకారం రిజర్వేషన్లు కల్పించాలని బీసీ హక్కుల సాధన సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి చింతకింది కుమారస్వామి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణంలో బీసీ హక్కుల సాధన సమితి ఆధ్వర్యంలో బిల్లా సందీప్ అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన సమావేశానికి కుమారస్వామి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు కులగణన ఆధారంగా రిజర్వేషన్లు అమలు చేయాలని ఆకాంక్షించారు. బీసీలను తరతరాలుగా ఓటుబ్యాంకుగా మాత్రమే అగ్రకుల పార్టీలు పరిగణిస్తున్నాయని ఆందోళన వెలిబుచ్చారు. బీసీల హక్కులను సాధించుకోవడం కోసం భవిష్యత్‌లో పెద్దఎత్తున ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. సమావేశంలో మండల అధ్యక్షుడు కంబాల వెంకన్న, ప్రధాన కార్యదర్శి అడ్డగట్ల యువరాజు, ఉపాధ్యక్షులు ఇల్లందుల సాంబయ్య, మండల శ్రీలత, సహాయ కార్యదర్శులు బల్ల సందీప్, కంబాల అరుణ, గౌరబోయిన పద్మ, చిలుక స్వప్న, గోనె కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.